నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక

తెలంగాణ జిల్లాలు

సోమవారం 13, మే 2024 పేజీలు: 04



# పోలింగ్‌కు పటిష్ట భద్రత

- ఎన్నికల ప్రశాంతతకు అన్ని ఏర్పాట్లు పూర్తి
- జిల్లా ఎన్నికల అధికారి అద్వైత్ కుమార్ సింగ్

మహబూబాబాద్ (నేటి ఫోకస్ న్యూస్)మే 12:

నేడు జరగనున్న లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి అద్వైత్ కుమార్ సింగ్ పేర్కొన్నారు. పోలింగ్ సిబ్బందిని తరలించే వాహనాలకు జీపీఎస్ అనుసంధానం తో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ప్రలోభాలకు గురికాకుండా ప్రతి ఒక్కరూస్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించి పోలింగ్ శాతం పెంచాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో సిబ్బందికి పోలింగ్ సామాగ్రి పంపిణీ స్వయంగా పరిశీలించారు. మహబూబాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ కు చెందినవి తెలంగాణ సాంఘీక సంక్షేమ జూనియర్ (బాలికల) కళాశాలలో, డోర్నకల్ అసెంబ్లీ నియోజకవర్గం నకు చెందినవి సెయింట్ అగస్టిన్ హై స్కూల్

మిగతా 2లో..




# పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది..

- ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియ క్షేత్రస్థాయిలో పరిశీలన
- నాగర్ కర్నూల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఉదయ్ కుమార్

ఉమ్మడి మహబూబ్నగర్ ప్రతినిధి, (నేటి ఫోకస్ న్యూస్)-చారగొండ వెంకటేష్ మే 12:

నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఉదయ్ కుమార్,ఆదివారం క్షుణంగా పరిశీలించారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని నాగర్ కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్

మిగతా 2లో..






# ఓటర్లకు తాయిలాలు పంపిణీ

- తమవైపు తిప్పుకునేందుకు పార్టీల నేతల బిజీబిజీ..
- కొరవడిన అధికారుల నిఘా
- పోలిం ఏజెంట్ల ఏర్పాటు..

(నేటి ఫోకస్ న్యూస్ ప్రత్యేక ప్రతినిధి) మే12:

నెలరోజులు సాగిన ఎన్నికల హంగమా, పదిహేను రోజులు హోరెత్తిన ప్రచారం ముగిసి ఆఖరి అంకానికి ప్రధాన పార్టీలు తెరతీశాయి. ఎన్నికల మేనేజ్మెంటులో అత్యంతముఖ్యమైన ఘట్టాన్ని కొనసాగించడంలో క్షేత్రస్థాయిలో నిమగ్నమయ్యారు. ఓటరుకు తాయిలాలు పంచడంలో రాష్ట్రంలోని ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆరెస్ పోటీపడుతున్నాయి. అనుకున్న లక్ష్యాన్ని చేరుకునే విధంగా బూతు స్థాయి నుంచి పంపిణీ కార్యక్రమం సాగుతోంది.

మిగతా 2లో..









# పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది







(మొదటిపేజీ తరువాయి..)

నియోజకవర్గాల పరిధిలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను స్వయంగా తిరిగి సందర్శించారు. ఆయా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో చేపడుతున్న ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరుతెన్నులను రిటర్నింగ్ అధికారి, కలెక్టర్, క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తాగునీటి వసతి, వైద్య శిబిరం, భోజన వసతి, షామియానాలు ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేయగా, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో సిబ్బందికి అన్ని సదుపాయాలు కల్పించామని తెలిపారు. పిఓలు, ఏపీవోలు, ఓపిఓలతో కూడిన బృందాలని హాజరయ్యారా లేదా అని కలెక్టర్ ఆరా తీశారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రి పక్కగా అందించాలని, చెక్ లిస్ట్ ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది సరిచూసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్దకు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించారు. సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలాగా పర్యవేక్షణ జరపాలని అధికారులకు ఆదేశించారు. ఎన్నికల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన తన దృష్టికి తేవాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఉదయ్ కుమార్, అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోలింగ్ ను నిర్వహించాలనీ చెప్పారు. ఉదయం 05.00 గంటలకే మాక్ పోలింగ్ చేపట్టాలన్నారు. ఉదయం 07.00 గంటలకు వాస్తవ పోలింగ్ ప్రారంభించాలని చెప్పారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతాన్ని నివేదించాలన్నారు. ఈవిఎంలకు ఏమైనా సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైనా, ఏమైనా సెక్టార్ అధికారులు, రిటర్నింగ్ అధికారులకు నివేదించాలని చెప్పారు. పోలింగ్ ముగిసిన అనంతరం నిబంధనల మేరకు సీల్ వేసి రిసెప్షన్ కేంద్రాలలో అప్పగించాలనీ చెప్పారు. సజావుగా ఎన్నికల సామాగ్రి పంపిణీ ప్రక్రియ నిర్వహించడం జరిగిందని ఎన్నికల సామాగ్రి పంపిణీకి పగడ్బందీ ఏర్పాట్లు చేయడంతో పంపిణీ ప్రక్రియ సజావుగా జరిగిందని తెలిపారు. ఎన్నికలలో మనం వేసే ఓటు మన భవిష్యత్తును నిర్దేశిస్తుందని, ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా ప్రజలు ఆలోచించి, స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## పోలింగ్‌కి పటిష్ట భద్రత

(మొదటిపేజీ తరువాయి..)

మరిపెడ కేంద్రంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని పోలింగ్ సామాగ్రి పంపిణీ ప్రక్రియను ప్రశాంతంగా జరిగిందన్నారు. లోక్ సభ ఎన్నికల పోలింగ్ విధులను వివిధ శాఖల నోడల్ అధికారులు సిబ్బంది ముఖ్య ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు లోబడి విధులు నిర్వహించాల్సి నదిగా జిల్లా కలెక్టర్ మరియుజిల్లా ఎన్నికల అధికారి అద్వైత్ కుమార్ సింగ్ అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన ఎన్నికల కంట్రోల్ రూంను పరిశీలించారు. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించుటకు ప్రతి పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించి పోలింగ్ లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. రేపు జరగనున్న లోక్ సభ ఎన్నికల నిర్వహణలో భాగంగా (16 ) మహబూబాబాద్ పార్లమెంట్ లోని అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలో డోర్నకల్ , మహబూబాబాద్, నర్సంపేట నియోజక వర్గాలలో పోలింగ్ సమయం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పినపాక, ఇల్లందు, భద్రాచలం, ములుగు నియోజక వర్గంలో పోలింగ్ సమయాన్ని ఉదయం 7 నుండి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించాల్సిందిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ( ఈసీ) ఉత్తర్వులను పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాల ఏర్పాటు అలాగే దివ్యంగా ఓటర్లకు ర్యాంప్ మరియు ట్రై సైకిల్ ఏర్పాటు చేయడం జరిగిందని , పోలింగ్ కేంద్రాల పరిధిలో 100 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ప్రజలు ఇట్టి విషయాన్ని గమనించాలని జిల్లా ఎన్నికల అధికారి పేర్కొన్నారు. ఎన్నికల సామాగ్రి తరలింపు ప్రక్రియలో అదనపు కలెక్టర్ రెవెన్యూ డేవిడ్ అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ లెనిన్ వత్సల్ టోప్పో, ఆర్డీవో అలివేలు, జడ్పీ సిఇఓ నర్మద, డిడి గ్రౌండ్ వాటర్ సురేష్ స్వీప్ నోడల్ అధికారి జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి మారియన్న, సంబంధిత నోడల్ అధికారులు, పిఓలు ,ఏపీవోలు, ఓపిఓ లు తదితరుల సమక్షంలో పోలింగ్ సామాగ్రి తరలింపు జరిగింది.



## ఓటరుకు తాయిలాలు పంపిణీ..

(మొదటిపేజీ తరువాయి..)

ఎప్పటికప్పుడు పరిస్థితులను ఆ పార్టీల ప్రధాన నేతలు, పోటీచేసిన అభ్యర్థులు పర్యవేక్షిస్తున్నారు. అయితే ఎన్నికలంటేనే సామాన్యులు, సాధారణ పార్టీలు భరించలేని స్థాయికి చేరాయనే విమర్శలున్నాయి. ఇప్పటికే ప్రచారానికి పెద్ద ఎత్తున ఖర్చు పెట్టినందున ఈ సారి ఓటరుకిచ్చే నగదు మొత్తం కొంత తగ్గినట్లు చర్చ సాగుతోందీ. ఈ వ్యవహారంలో ఆరితేరిన బీఆరెస్ సైతం కొంత తగ్గించి పంపిణీ చేయడంతో మిగిలిన పార్టీలు కూడా ఇదే బాటలో పయనించినట్లు చెబుతున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికలతో దూల తీరిన పార్టీలు, మరోసారి అదే స్థాయిలో పంపిణీ చేయాలంటే కొంత భారంగా మారిందనే వాదనవినిపిస్తోంది. భారీ పోటీతో పాటు డబ్బున్న అభ్యర్థులు పోటీ చేస్తున్న నియోజకవర్గాల్లో మాత్రం దీనికి భిన్నమైన పరిస్థితి కనిపిస్తోందీ.

### నిఘా బృందాల కళ్ళుగప్పి పంపిణీ..

ఎన్నికల కమీషన్ అధికారులు, సిబ్బంది, పోలీసులు, నిఘా వ్యవస్థను నిదురపుచ్చి ఓటరుకు నగదు పంపిణీ కార్యక్రమం యధేచ్ఛగా ఈ వ్యవహారం సాగిపోతోంది. ఎన్నికలు అనగానే ఈ పంపిణీ సైతం షరామాములు వ్యవహారంగా మారిపోయింది. అటు ఓటరుకు ఇటు పోటీ చేసే అభ్యర్థులు, పార్టీలకు తప్పనిసరి అంశంగా తయారైందీ. సర్వత్రా ఈ తతంగం సాగిపోతున్నా ఎన్నికల కమిషన్ అధికారులు కూడా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇదంతా బహిరంగ సత్యమే అయినప్పటికీ ఎన్నికల కార్యకలాపాల్లో భాగమన్నట్లుగా పంపిణీ కార్యక్రమం సాఫీగా సాగిపోతూనే ఉంటాయి. ఇంటింటి ప్రచారం, వ్యక్తిగత ప్రచారం, పోల్ చిట్టీల పంపిణీ పేరుతో ఓటుకు నోటు పథకం సాగిపోతోంది. అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే చాలా ప్రాంతాల్లో ఈ సారి ఓటు రేటు పడిపోయిందని ఓటర్లు అందోళన వ్యక్తం చేస్తున్నారు. రూ. వెయ్యి నుంచి రూ.100 ముట్టజెప్పినట్లు సమాచారం. బాగా పోటీ ఉన్న ప్రాంతాల్లో ఇంకొంత ఎక్కువ అందజేసి ఓటరును తమ వైపు తిప్పుకునేందుకు పోటీపడ్డట్లు చెబుతున్నారు. మరి కొన్ని ప్రాంతాల్లో వస్తు రూపేణా అందజేశారు. చీరలు, కుక్కర్లు, మిక్సీలు, యువతకు క్రికెట్ కిట్ లు అందజేశారు. ఎక్కువగా నగదు అందించేందుకు ప్రయత్నించారు. నగదు పంపిణీ సులభతరం కావడంతో ఇటీవల కాలంలో అభ్యర్థులు దానికి ప్రాధాన్యతనిస్తున్నారు. కొన్ని చోట్ల మాత్రం మద్యం పంపిణీ చేశారు.

### పోలింగ్ ఏర్పాట్లలో పార్టీలు..

సోమవారం జరుగనున్న పోలింగుకు అవసరమైన ఏర్పాట్లలో ప్రధాన పార్టీలు,అభ్యర్థులు నిమగ్నమయ్యారు. రేపటి పోలింగు సందర్భంగా తమ తమ పార్టీల నుంచి పోలింగు ఏజెంట్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. రేపటి పోలింగును నిరంతరం పర్యవేక్షించే విధంగా వారిని అప్రమత్తం చేస్తున్నారు.

# ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోండి

◆ కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవికి ఓటేసి గెలిపించండి ◆ నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మద్దెల దివాకర్

**ఉమ్మడి మహబూబ్నగర్ ప్రతినిధి, (నేటి ఫోకస్‌న్యూస్)-చారకొండ వెంకటేష్ మే 12:**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకొని నాగర్కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మల్లురవికి మీ యొక్క అమూల్యమైన ఓటును వేసి గెలిపించాలని జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దేల దివాకర్ నేటి ఫోకస్ న్యూస్ ఆదివారం మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పేదల పక్షాన నిలబడి అన్ని వర్గాల ప్రజలను హక్కున చేర్చుకునే పార్టీ కాంగ్రెస్ అన్నారు. కేంద్రంలో యువ నాయకుడు రాహుల్ గాంధీ ప్రధాన మంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉందన్నారు. అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో ఒకటే పార్టీ ఉంటే ఆ రాష్ట్రం జిల్లా అన్ని అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందన్నారు. నేడు పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలందరూ పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకుని రాజకీయ అనుభవం ఉన్న మల్లు రవిని మన మందరం అత్యధిక మెజార్టీతో ఓటు వేసి గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఇచ్చిన మాటను కట్టుబడి ముందుకు వెళుతున్న కాంగ్రెస్ పార్టీన్ని ప్రతి





ఒక్కరు ఆదరిస్తున్నారని తెలిపారు. ప్రతి మహిళకు లక్ష రూపాయలు, 30 లక్షల ఉద్యోగ అవకాశాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఇచ్చిన హామీలు తూచా తప్పకుండా కాంగ్రెస్ పార్టీ నెరవేరుస్తుందన్నారు. ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే ఐదు కొనసాగుతున్నాయని తెలిపారు. బీఆర్ఎస్, బిజెపి పార్టీలు ప్రజలను మోసం చేసి పది సంవత్సరాలు అధికారంలో కొనసాగారన్నారు. ప్రజలు బిజెపి, బీఆర్ఎస్ పార్టీలను ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పి తీరాలని ఆయన అన్నారు. ఆయనతోపాటు పార్టీ నాయకులు సామాసాయిలు, ఓంకారం, వీరభద్రయ్య, బొంత బాలస్వామి, నరసింహాలతో పాటు మరి కొంత మంది పాల్గొన్నారు.

# ఓటు.. మన ఆయుధం



ప్రపంచ గతిని మార్చగల శక్తి ఉన్న అస్త్రం"ఓటు". ఒక వ్యక్తి అస్తిత్వాన్ని గుర్తించి, వ్యవస్థ మార్పుకి నాంది పలికేది "ఓటు". ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమవంతు కర్తవ్యంతో ఉన్నతమైన నాయకుల్ని ఎన్నుకొనే విధానం. పురుషులతోపాటు మహిళలకు సమనహక్కు కల్పించిన మహిళల పక్షపాతి. ఆయన రాసిన రాజ్యాంగం వల్ల నేడు మహిళలు చదువుకుని, ఉద్యోగాలు చేస్తున్నారు, రాజకీయాల్లో ఉంటున్నారు.. కార్మికులకు ఉద్యోగులకు 8గంటల పని హక్కు కల్పించిన కార్మిక పక్షపాతి. భారతీయులందరికి 18 సంవత్సరాల వయస్సుకే ఓటుహక్కును కల్పించిన దేశ పౌరుల వేగుచుక్క ప్రజాస్వామ్యం అని గొప్పలు చెప్పుకునే యువత నీకు ఓటు హక్కు ఇచ్చింది అంబేద్కర్ గారు..బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకోసం 5 సంవత్సరాల నుండి14 సంవత్సరాల లోపల ఉన్నపిల్లలకు ఉచిత విద్యా హక్కు కల్పించిన భారత దేశ చిన్నారుల ఆణిముత్యం అంబేద్కర్. బానిస బ్రతుకులు బ్రతుకుతున్న అంటారనివాళ్ళ విముక్తి కోసం ఎస్సీఎస్టీబిసి లకు రిజర్వేషన్లు కల్పించి ఆరాధ్యుడు అంబేద్కర్. ఎస్సీ, ఎస్టీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కలిపించిన గొప్ప వ్యక్తి దేశంలో రిజర్వ్ బ్యాంకు ద్వార ప్రతి ఒక్క భారతీయుడికి ఆర్థిక హక్కుల తో పాటు ఇంకా ఎన్నో హక్కులను ప్రసాదించిన మహనీయుడు అంబేద్కర్. అన్నిటికంటే గొప్ప సంగతి దేశం గర్వపడే విషయం అంబేద్కర్ భారతీయులందరికి గొప్ప రాజ్యాంగాన్ని రచించిన మహా జ్ఞాని. రాజ్యాంగం ద్వారా హక్కులు పొందిన ప్రతి ఒక్కరికీ నాయకుడు అంబేద్కర్. అంబేద్కర్ ఈ దేశంలో కొందరి వాడు కాదు అందరివాడు, దేశ ప్రజలందరి ఆశ దీపం అంబేద్కర్.ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు.

**ఓటు వేయండి ప్రజాస్వామ్యాన్ని కాపాడండి..**

ఓటు హక్కును నైతికంగా వినియోగించుకోవడమే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గారికి నిజమైన గౌరవం అవుతుంది" మనం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ యొక్క తత్వశాస్త్రం మరియు భావజాలాన్ని వాస్తవికంగా అనువదించాలనుకుంటే, ఓటు హక్కును నైతికంగా మరియు న్యాయంగా వినియోగించుకోవడం మన ప్రధాన కర్తవ్యం ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా మన రాజ్యాంగ హక్కులను పరిరక్షించుకోవడంతో పాటు దేశ ప్రగతికి భరోసా ఇవ్వగలం. ఓటును వినియోగించడం దేశ పౌరసత్వానికి చాలా అవసరమని చారిత్రాత్మకంగా అణగారిన వర్గాలకు ఓటు రాజకీయ విద్యగా ఉపయోగపడుతుందని అంబేద్కర్ గారు భావించేవారు. ప్రజాస్వామ్య పౌరసత్వం యొక్క అత్యంత ప్రాథమిక అంశాలలో ఒకటిగా ఓటు హక్కు ఉంది అని తెలిపారు. భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుల్లో ఒకటైన ఓటు హక్కు. ఏ ప్రజాస్వామ్య దేశంలోనైనా ప్రజలే నిర్ణేతలు వారి మనోభావాలను ప్రకటించేందుకు ప్రజల చేతిలో ఉన్న ఏకైక పదునైన ఆయుధం ఓటు.

**భారత రాజ్యాంగం మనకు కల్పించిన ఓటు హక్కు..**

నీతి,నిజాయితీ, నమ్మకం, భాధ్యత ఉన్న వ్యక్తిని గెలిపించి చట్ట సభల్లోకి పంపిస్తే, ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం కోసం, మౌళిక వసతులు కల్పించడం కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం, నీతిగా నిజాయితీగా నమ్మకంతో భాధ్యతగా పని చేస్తారని, ఆనాడు పెద్దలు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ గారు ఓటు హక్కును భారత రాజ్యాంగంలో పొందుపరిచారు. అదే "మన చేతిలో ఉన్న బ్రహ్మ అస్త్రం – ఓటు హక్కు"కాని ఈనాడు రాజకీయ నాయకుల స్వార్థ ప్రయోజనాల కోసం,ప్రజలను తప్పు దారి పట్టించి,ప్రలోభాలకు గురి చేస్తు, మన హక్కును బ్రష్టు పట్టిస్తున్నారు. ఓటరు మహాశయులారా అలాంటి వారిని తరిమి కొట్టి నికార్సైన నాయకుని ఎన్నుకొని అభివృద్ధికి పాటుపడండి. ప్రజాస్వామ్యం ప్రజల కోసం ఏర్పడిన ప్రజా యంత్రాంగం ప్రజాస్వామ్యం మనగలిగే ప్రజలు హాయిగా స్వేచ్ఛగా జీవించగలుగుతారు. భావవ్యక్తీకరణకు ప్రజలకు లభించిన వరం ప్రజాస్వామ్యం ప్రజలకు గొంతు ఇచ్చింది అరాచకాలపై పోరాడే హక్కు ఇస్తుంది ఇప్పటికీ పలు దేశాల్లో సౌదీ అరేబియా, వాటికన్ సిటీ మయన్మార్ లో ప్రజాస్వామ్యం ఏర్పడలేదు మరికొన్ని మత చాందస వాద దేశాల్లో ప్రజాస్వామ్యం మున్నా పరమతసహనం సున్నా ప్రజాస్వామ్యం లేని ప్రజల జీవితం దుర్భరం ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలి ఓటు హక్కును నమ్ముకోవాలి అమ్ము కోకూడదు ప్రజాస్వామ్య సమాజంలో స్వేచ్ఛగా జీవించాలి. ప్రజల చేత ప్రజల కొరకు ప్రజలే ఎన్నుకొనే చట్టబద్ధమైన విధానాన్ని ప్రజాస్వామ్యంగా అమెరికా మాజీ అధ్యక్షుడు అబ్రహం లింకన్ నిర్వచించారు. ప్రజలు కనికరించి ఓటు వేస్తే పాలకులు అయ్యే రోజులు వచ్చాయి.. పటిష్టమైన ప్రజాస్వామ్యం ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపం, ప్రజాస్వామ్య పునాదులు బలంగా లేని దేశాల్లో ప్రజాస్వామ్యం అనేది నేతిబీరకాయ చందంలా నిరుపయోగమే. ఏ దేశంలోనైనా ప్రజాస్వామ్యం మనుగడ సాగించాలంటే ఆయా దేశాల ప్రజలు చైతన్యవంతులై విద్యావంతులై ప్రజాస్వామ్య స్ఫూర్తి కలిగి ఉండాలి. అంబేద్కర్ గారు కల్పించిన ఆయుధం ఓటు ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టి ప్రజలకు సుపరిపాలన అందించటంలో అత్యంత కీలకం కానీ ఓటు నోటుకు బానిసయ్యి ప్రజలను బానిసత్వంలోకి తీసుకెళ్లే పరిస్థితి గురించి ఆలోచించి ఓటు వేసి మెరుగైన సమాజాన్ని నిర్మిద్దాం భావి తరాలకు బంగారు బాట వేద్దాం.

**- వ్యాసకర్త: ఆలేటి రమేష్**
**9948798982**

## జర్నలిస్ట్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

**పెద్ద వంగర(నేటి ఫోకస్ న్యూస్)మే 12:**

మండల కేంద్రంలోని కోరిపల్లి గ్రామానికి చెందిన ప్రజా గొంతుక న్యూస్ రిపోర్టర్ విద్యుత్ షాక్‌తో మరణించిన విషయాన్ని తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నవీన్ కుటుంబాన్ని పరామర్శించి ప్రగడ సానుభూతి తెలిపారు అనంతరం దయాకర్ రావు మాట్లాడుతూ జర్నలిస్టు నవీన్ చనిపోయిన విషయం తెలిసినాక చాలా వరకు నాకు బాధాకరంగా ఉంది కుటుంబానికి ఎల్లవేళలా తోడుగా ఉంటాను ఎలాంటి ఇబ్బంది వచ్చిన బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు ఆరుట్ల వెంకట్ రెడ్డి మాజీ సర్పంచ్ విశ్వనాధుల జ్ఞానేశ్వర చారి మండల కో ఆప్షన్ నెంబర్ ఎండి ముజీవుద్దిన్ రైతు కోఆర్డినేటర్ బొమ్మిడి కృష్ణారెడ్డి గ్రామ కార్యదర్శి ఎడ్ల చిరంజీవి మాజీ సర్పంచ్ గాజుల శోభ ప్రసాద్ రావు ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎర్ర వెంకన్న బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి యాకూబ్ ఎర్ర బిక్షం మహంకాళి యాకన్న యూత్ నాయకులు నీరటి మురళి వెలుగొండ కృష్ణ ఎర్ర సతీష్ ఎర్ర ఉదయ్ తాళ్లపల్లి రాజ్ జలగం ఎంకన్న అనీలు నాయకులు ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

